క్లుప్తంగా

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

ఏ.కొండూరు: మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు పంపిణీ చే సేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ రాజశేఖ ర్ బుధవారం తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియానికి సంబంధించిన 13 వేల పాఠ్య పుస్తకాలు కంభంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశా ల లో ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు జగన న్న విద్యా కానుక బెల్ట్, యూనిఫామ్స్, నోట్ బు క్స్ కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నా రు. వీటిని త్వరలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు తెలిపారు.

బోరు పనులు ప్రారంభం



ముసునూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నూతన బోరు, మోటారు వేయించి, తాగునీటి సరఫరా కల్పిస్తున్నట్లు గోపవరం వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ పాముల గంగాధర రావు ఎంపీటీసీ నిధులు రూ.3 లక్షలతో గంగానమ్మ గుడి ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం బుధవారం బోరు వేయించి, మోటారు బిగిస్తున్నట్లు చెప్పారు. దీనికి అనుసంధానంగా 5,000 లీటర్ల నీటి సామర్థ్యంతో ట్యాంకు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ కంచర్ల వాణి, ఉప సర్పంచ్ పులిచర్ల లక్ష్మయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని గోపి పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీపై సబ్‌కలెక్టర్ విచారణ



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన గోలి వెంకటేశ్వరావు 126 సర్వే నంబర్లో ఉన్న మూడెరాల భూమికి పాసు పుస్తకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ భూమి కోర్టు వివాదంలో ఉంది. దీనిపై నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. తహసీల్దార్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నిర్మాణంపై విచారణ



చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామ సచివాలయం పక్కన ఉన్న స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్డి నిర్మించారు. ఆ స్థలం తమకు చెందిందని జిల్లా కలెక్టర్‌కు పోస్టల్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో నూజివీడు డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.సుందరి బుధవారం విచారణ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి, ఈఓపీఆర్డీ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం అ య్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్వామివారికి విశేషంగా పూజలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి ప్రత్యేకంగా పంచామృత అభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనపడటం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రామరాజ్యనగర్ కబేళా సెంటర్ సమీపంలో ముత్యాల వెంకటనర్సమ్మ తన కుటుంబంతో కలిసి జీవిస్తుంది. ఆమెకు 22 ఏళ్ల కుమార్తె ఉంది. కుమార్తె బుధవారం ఉదయం స్థానికంగా నివాసముంటున్న తన పిన్ని ఇంటికి వెళ్లి వస్త్రాలను ఇస్త్రీ చేసుకొని వస్తానని బయటకు వచ్చింది. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. దాంతో వెంకటనర్సమ్మ మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన చెల్లెలు ఇంటికి వెళ్లి కుమార్తె గురించి వాకబు చేసింది. ఆమె ఉదయం వచ్చి వెళ్లినట్లు తెలుసుకుంది. ఇతర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవటంతో బుధవారం రాత్రి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాల్లో ఆధునిక సదుపాయాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పూర్ణమ్మ



తిరువూరు గ్రంథాలయంలో చైర్‌పర్సన్

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధితోపాటు ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జే పూర్ణమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించిన ఆమె పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. పోటీ పరీక్షల మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు శాఖా గ్రంథాలయాలకు పాఠకుల వినతి మేరకు పంపుతున్నామన్నారు. ఇంటర్‌నెట్, కంప్యూటర్ సదుపాయం కల్పించామన్నారు. ఇటీవల పలు ప్రభుత్వోద్యోగాలకు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్‌ను ఉపయోగించుకుని నిరుద్యోగులు ఎంపికయ్యారన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. వేసవి శిక్షణలో ప్రతిభకనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం చైర్ పర్సన్ సందర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, కీర్తి, రాంబాబు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకునేలా ప్రోత్సహించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరవుతున్న విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రంథాలయాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సమ్మర్ క్యాంప్ నిర్వహణను పరిశీలించి లైబ్రేరియన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ వేసవి శిబిరానికి విద్యార్థులు తప్పనిసరిగా హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొల్లపూడి శాఖ గ్రంథాలయం రికార్డ్ అసిస్టెంట్ ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మైలవరం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్‌పర్సన్

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమలాపూర్ణిమ అన్నారు. కొండపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె బుధవారం సందర్శించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అచ్యుత రావు, రాంబాబు పాల్గొన్నారు.

పఠనాసక్తికి గ్రంథాలయాలు కీలకం

గోపవరం (ముసునూరు): పఠనాసక్తికి గ్రంథాలయాలే కీలకమని గోపవరం వ్యవసాయ సొసైటీ, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం పలు పోటీలు నిర్వహించారు.

నూజివీడులో..

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో బుధవారం వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కథలు పుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలను చదివించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో పేదలకు ధీమా



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు



నూగొండపల్లిలో బీమా నగదును అందజేస్తున్న నాయకులు

ముసునూరు: వైఎస్సార్ బీమాతో పేదల జీవితాలకు ధీమా ఏర్పడుతుందని చెక్కపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ అన్నారు. గ్రామానికి చెందిన మకుటం శ్రీను (48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీను వైఎస్సార్ బీమా పథకానికి అర్హుడు కావడంతో తక్షణ సహాయంగా రూ.10 వేలు అంతిమ సంస్కారాల నిమిత్తం ఆయన భార్య వీ ర్లంకమ్మకు వార్డు సభ్యురాలు పేరిచర్ల రమణ బుధవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు వీర్లంకమ్మ ఖాతాలో జమకానున్నాయి. సచివాలయ సంక్షేమ కార్యదర్శి ఆనంద్, వలంటీరు వెంకన్న బాబు పాల్గొన్నారు.

నగదు అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని నూగొండపల్లి ఎస్సీవాడకు మంగళగిరి పరావస్తు దాసు అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద దాసు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు బుధవారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందుల మల్లేశ్వరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మల్లవల్లి వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వేణు, నాయకులు శివశంకర్ పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి

మైలవరం: మైలవరం నారాయణనగర్ వద్ద వాగుపై వంతెన నిర్మించాలని కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి కోరారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజా చార్జి షీటును బీజేపీ నాయకులతో కలిసి మైలవరం తహసీల్దారు శ్రీనివాసరావు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హరిప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(ఏపీపీసీబీ), రైల్వే హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ‘మిషన్ లైఫ్’ అనే పేరుతో రైల్వే మినీ స్టేడియం నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ టి.ప్రసాదరావు పాల్గొని మిషన్ లైఫ్ పేరుతో ‘సేవ్ ఎనర్జీ–కన్జర్వ్ వాటర్’ అనే అంశంపై అవగాహన కల్పించి పర్యావరణ అనుకూలమైన పద్ధతులను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పేపర్ వాడుకను వీలైనంత తగ్గించుకోవాలని, కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ వినియోగించాలని, సోలార్ విద్యుత్ వాడకం, ఎల్ఈడీ బల్బుల వాడకం, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన తీసుకురావటమే ఈ మిషన్ లైఫ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ రవికాంత్ పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వే మినీ స్టేడియం నుంచి గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా రైల్వే హాస్పిటల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే కాలనీ చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ వి.వాసుదేవరావు, ఏపీపీసీబీ సిబ్బంది పాల్గొన్నారు.



మిషన్ లైఫ్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

రక్తపోటుపై అవగాహన అవసరం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ రైల్వే హాస్పిటల్, నాగార్జున హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ బ్లాక్‌లో రక్తపోటుపై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని రక్తపోటు, దానికి కారణాలు, లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై రోగులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ బీపీ పరీక్షలు చేయించుకుని జీవనశైలిలో తగు మార్పులు చేసుకోవాలని సూచించారు. రక్తపోటు అశ్రద్ధ చేయడం వలన గుండె, మెదడు, మూత్రపిండాలు, ఇతర తీవ్రమైన వ్యాధుల బారినపడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం వలన ఒత్తిడిని అధిగమించడం ద్వారా రక్తపోటు నుంచి దూరంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ ఎల్.రవికాంత్, నాగార్జున హాస్పిటల్ ఫిజీషియన్ డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.



రైల్వే హాస్పిటల్‌లో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నేటి యువతరానికి దక్షిణ భారత ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సీపీఎం అఖిల భారత తొలి ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాలు సింగ్‌నగర్, వడ్డెరకాలనీ, ఉడాకాలనీ, శాంతినగర్, కంండ్రి ప్రాంతాల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. వీటికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకుడు సుందరయ్య అన్నారు. తెలుగు గడ్డపై పుట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆ మహనీయుడి జయంతి వేడుకలను జరిపి, అదే రోజు లెనిన్‌సెంటర్‌లో బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. సీపీఎం నాయకులు కె.శ్రీదేవి, బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, జి.ఝాన్సీ, వెంకటరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు



తిరువూరులో మజ్జిగ పంపిణీ

మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవస్థానం వద్ద దాతలు దూపకుంట్ల నాగేశ్వరరావు, రాజేశ్వరి, శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి బుధవారం ప్రారంభించారు. దేవస్థానం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మహేష్, కన్నయ్య, ప్రసాద్, జగన్, ఉమామహేశ్వరరావు, మధు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక బోస్ సెంటర్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ నాళ్లా వెంకటరామారావు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ముగిసేవరకు మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. తిరువూరు పట్టణ వాసవీ క్లబ్ అధ్యక్షుడు దోసపాటి రవికుమార్, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు అనురాధ, యువసేన క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రచారం

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ రహిత సమాజం కోసం మండలంలో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు సీఐ పి.శ్రీను బుధవారం తెలిపారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడి, సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు గంజాయి, కొకైన్ తదితర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు తెలియజేస్తూ బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

గానుగపాడులో బడిబాట

గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడులో బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రామకృష్ణారెడ్డి, రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు సిద్ధం

ముసునూరు: 2023–24 విద్యా సంవత్సరం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 20న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఇంటర్మీడియట్, డిగ్రీ అభ్యర్థులకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని దరఖాస్తుదారులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని డీటీకి వినతి

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలు పరిష్కరించాలని బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు మండల డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో నీటి కుళా యిలు, డ్రెయినేజీలు, రోడ్ల అభివృద్ధి చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్ కె.నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఇబ్రహీంపట్నం: నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో ప్రభుత్వ స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించిన యూ ట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పాలడుగు దుర్గాప్రసాద్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, సీఐ పి.శ్రీనుకు బుధవారం ఫిర్యాదు చేశారు. 2017లో ఇతరులకు కేటాయించిన రెండు సెంట్ల స్థలంపై మీడియా ముసుగులో నకిలీ పత్రాలు, నకిలీ రిజిస్ట్రేషన్‌తో మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారులను పక్కదారి పట్టించాడని పేర్కొన్నారు. స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బండి వెంకటరావు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అర్హుల జాబితా

తాతకుంట్ల (విస్సన్నపేట): మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 2023–24 సంవత్సరానికి మొదటి విడత రైతుభరోసాకు సంబంధించి లబ్ధిదారుల అర్హులు, అనర్హుల జాబితాను ఆర్బీకేలలో ప్రదర్శించినట్లు ఏఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని తాతకుంట్ల రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ బుధవారం తనిఖీ చేసి, మాట్లాడారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే గురువారం లోపు గ్రీవెన్స్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి

రెడ్డిగూడెం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు పని కల్పించనున్నట్లు ఏపీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని కుదప గ్రామంలో ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో 7,550 మంది కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 12 గ్రామాల్లో 43 చోట్ల పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



కుదప గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ భాస్కర్

ఉపాధి కూలీలకు అన్ని వసతులు

ఏ.కొండూరు: ఉపాధి హామీ కూలీలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని ఏపీఓ రామారావు పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు, గొల్లమందల గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో 9,200 మంది కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

నూజివీడు: ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహాలు ధ్వజమెత్తారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసనగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మజ్జిగ, మంచినీరు, పనిముట్లు వంటి వాటిని కల్పించడం లేదని, ఈ పథకాన్ని ఎత్తివేయాలనే కుట్రలో భాగంగానే రెండు పూటల పనివిధానం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టమ్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. రెండు పూటలా పనిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో కుటుంబానికి 200 వందల పనిదినాలు, రూ.600 రోజు కూలిని చెల్లించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రాజు పాల్గొన్నారు.



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు, నాయకులు

ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ బలోపేతానికి కృషి

మైలవరం: వేసవిలో ఎలక్ట్రికల్ వర్కర్స్ అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు పేర్కొన్నారు. ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సమగ్ర సర్వేలో భాగంగా బుధవారం మైలవరం మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమైక్యంగా వర్కర్స్ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అసోసియేషన్ మైలవరం మండల అధ్యక్షుడు కే పెదబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్, ఎంవీఎన్ బ్రహ్మం, సలీమ్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డీ సత్యనారాయణ, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రచార కమిటీ సభ్యుడు నారాయణరావు పాల్గొన్నారు.



అసోసియేషన్ సభ్యులతో నాయకులు